క్లుప్తంగా

ఆత్మహత్యాయత్నం

ఐనవోలు: విష గుళికలు మింగి మహిళ ఆత్మ హత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గురు వారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మచ్చ యశోద కుటుంబ కలహాల కారణంగా గురు వారం సాయంత్రం పొలంలో వినియోగించే విషగుళికలు మింగింది. గమనించిన స్థానికు లు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా కుమార్



కమలాపూర్ : మండలంలోని భీంపల్లి గ్రామానికి చెందిన బొంకూరి కుమార్‌ను ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బొంకూరి కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ వారికి అండగా ఉంటానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన బల్మూరి వెంకట్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్, హనుమకొండ జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సతీష్, హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు హనుమాన్ ప్రసాద్, హుజురాబాద్ మండల అధ్యక్షుడు కొల్లూరి కిరణ్, టీపీసీసీ సభ్యుడు కర్ర భగవాన్‌రెడ్డి, ఓబీసీ రాష్ట్ర నాయకుడు తొటం రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేశిని ఐలయ్య, సోషల్ మీడియా, హుజురాబాద్ కోఆర్డినేటర్ వాసాల శ్రీనివాస్, భీంపెల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కుక్కల ఓదెలు, యూత్ కాంగ్రెస్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గండ్ర గెలుపు ఖాయం



శాయంపేట : రానున్న ఎన్నికల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మరోసారి భారీ మెజారిటీతో గెలిచి మంత్రి కావాలని ఉప సర్పంచ్ దైనంపల్లి సుమన్ కోరారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని 22 గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు చందా రూ. 85వేల 116 నగదును అందించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై ఉండాలని కోరారు. గండ్ర దంపతులు నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో గణనాథుని అనుగ్రహంతో భారీ మెజారిటీతో గెలువాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మత్స్యగిరిస్వామి ఆలయ చైర్మన్ సామల భిక్షపతి, నాయకులు వినుకొండ శంకరాచారి, మారెపల్లి మోహన్, బత్తుల కార్తీక్, దైనంపల్లి కరణ్‌బాబు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి నివాళి



శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన లక్ష్మి, సూరంపేట గ్రామానికి చెందిన జున్నోత్తుల లక్ష్మారెడ్డి బుధవారం వివిధ కారణాలతో మృతి చెందగా ఎంపీపీ తిరుపతిరెడ్డి మృత దేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ విజయ, సూరంపేట సర్పంచ్ బొల్లెద్ల రజిత రఘుపతిరెడ్డి, నాయకులు దూదిపాల రాజిరెడ్డి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి, డీటీ రెడ్డి, సదయ్య, సుమన్, సంపత్ పాల్గొన్నారు.

నడికూడలో..



నడికూడ: మండలంలోని నడికూడ సర్పంచ్ ఊర రవీందర్‌రావు తండ్రి ఊర రాజేశ్వరరావు బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా పలువురు గురువారం పరామర్శించారు. తెలంగాణ రైతురుణవిమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చందు, ఉపసర్పంచ్ కిన్నెర మణి, వరికేల కిషన్‌రావు, లోకాటి నగేష్, మండల జర్నలిస్టులు జమాల్, సుధీర్, అశోక్, రమేష్, సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులు వేర్వేరుగా పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. రాజేశ్వరరావుతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

ఘనంగా గణపయ్య నిమజ్జనం

- ఆటా, పాటలతో ముగిసిన శోభాయాత్ర
- బైబై గణపయ్య అంటూ వీడ్కోలు



పరకాల: అర్ధరాత్రి వరకు కొనసాగిన గణపతి శోభాయాత్ర

పరకాల: పట్టణంలో గణపయ్య నిమజ్జన వేడుకలు గురువారం తెల్లవారుజామున 4 గంటల వరకు కొనసాగాయి. వరుణ దేవుడు కరుణించడంతో చాలా మంది మండపాల నిర్వాహకులు నిమజ్జనానికి ఆలస్యంగా బయలుదేరి శోభాయాత్రతో చలివాగు ఒడ్డుకు చేరుకున్నారు. మున్సిపల్ సిబ్బంది క్రేన్ సాయంతో గణేష్ నిమజ్జనాలు పూర్తి చేశారు. తెల్లవారుజాము వరకు మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, సీఐ వెంకటరత్నం, విద్యుత్ శాఖ ఏఈ సత్యనారాయణ, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో 65 విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు. దీంతో పండుగ ప్రశాంతంగా ముగిసింది.

కమలాపూర్‌లో..

కమలాపూర్: మండల వ్యాప్తంగా గణపతి నిమజ్జన వేడుకలు గురువారం రెండో రోజు ఘనంగా జరిగాయి. నవరాత్రుల పాటు పూజలు అందుకున్న గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఆసీనులు చేసి భక్తిశ్రద్ధలతో భజనలు, కోలాటాలు, నృత్యాలు చేస్తూ పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. మండలంలోని భీంపల్లిలో చేయూత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద లడ్డూను రూ.30,116కు కుర్మిండ్ల ప్రశాంత్ వేలం పాటలో దక్కించుకున్నారు. కాగా కమలాపూర్‌లో గణపతి నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో ఇన్‌స్పెక్టర్ సంజీవ్ దంపతులు మహిళలతో కలిసి కోలాటం ఆడగా, ఇన్‌స్పెక్టర్ యువకులతో కలిసి నృత్యాలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఇన్‌స్పెక్టర్ సంజీవ్, ఎస్సై సీమాఫర్హీన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, భక్త, భజన మండళ్ల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

దామెరలో..



పరకాల: చెరువులో నిమజ్జనం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



దామెర: గణపతి లడ్డూ లక్కీడ్రా విజేతను ప్రకటిస్తున్న రమణారెడ్డి



కమలాపూర్ : మహిళలతో కలిసి కోలాటం ఆడుతున్న ఇన్‌స్పెక్టర్ దంపతులు



కమలాపూర్ : గణపతి శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న ఆర్యవైశ్య మహిళలు

దామెర: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గణేశ్ నిమజ్జన వేడుకలు గురువారం కోలాహలంగా జరిగాయి. మండల కేంద్రంలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద రైతుబంధు మండల కోఆర్డినేటర్, బిల్లా సరోజినిదేవి ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం లడ్డూను లక్కీడ్రా ద్వారా విజేతకు అందించారు. మాజీ సర్పంచ్ సరోజినిదేవి, బీఆర్ఎస్ యూత్ నాయకులు కిషోర్, రాకేష్, మాదారపు కృష్ణ, అరవింద్, సునీల్, వార్డు సభ్యులు సంపత్ పాల్గొన్నారు.

‘చల్లా’ను గెలిపించి కేసీఆర్‌కు గిఫ్ట్ ఇవ్వాలి

- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- రూ.4.40కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల: పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ప్రజలు మళ్లీ గెలిపించి సీఎం కేసీఆర్ కు గిఫ్ట్ ఇవ్వాలని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని గెలిపించుకోకపోతే ప్రజలు నష్టపోతారని అన్నారు. మండలంలో రూ.2కోట్ల 24లక్షలతో వెంకటాపూర్ నుంచి లక్ష్మీపురం, రూ.1కోటి 80లక్షలతో నాగారం నుంచి మల్కపేట వరకు, రూ.1కోటి 40లక్షలతో నాగారం నుంచి పైడిపల్లి వరకు నూతనంగా చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను పలుమార్లు కలిసి రూ.250 కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి సేవలు ఈ ప్రాంత ప్రజలకు అవసరం అన్నారు.

నాపై పోటీకి జంకుతున్నారు..

ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బతిమిలాడుకొని నియోజకవర్గ అభివృద్ధిలో రాజీపడకుండా కృషిచేయడమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందేలా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే ధర్మారెడ్డి అన్నారు. అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయని, నాపై పోటీ చేసేందుకు కాంగ్రెస్ నాయకులు జంకుతున్నారని ఆరోపించారు. మరోవైపు బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారాలతో ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, జెడ్పీటీసీ సిలువేరు మొగిలి, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నిప్పాని హైమావతి, మాజీ చైర్మన్ బొజ్జం రమేష్, పరకాల, మాధారం పీఏసీఎస్ చైర్మన్లు గుండెబోయిన నాగయ్య, నల్లెల లింగమూర్తి, పోచారం ఎంపీటీసీ రమేష్, బీఆర్ఎస్ నాయకులు చింతిరెడ్డి సాంబరెడ్డి, సురేందర్‌రావు, రమేష్‌తో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలు మోసం చేస్తున్నాయి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హసన్‌పర్తి: గౌడ కులస్తులను రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని గౌడ జేఏసీ ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ రంజిత్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 1న హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్న గౌడ గర్జనసభ వాల్‌పోస్టర్లను సిద్దాపురంలో గురువారం ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో గౌడ కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సర్పంచ్ ధనలక్ష్మి, జేఏసీ నాయకులు యుగంధర్ గౌడ్, సాగర్, జనార్దన్ గౌడ్, శ్రీనివాస్, క్రాంతి, ప్రవీణ్, అజయ్ పాల్గొన్నారు.

ఎరుకల కులస్తులకు అన్యాయం చేయొద్దు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సర్పంచ్ రాజు

ఆత్మకూరు : పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న ఎరుకల కులస్తులకు అన్యాయం చేయొద్దని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు కోరారు. మండల కేంద్రానికి చెందిన దుగ్యాల రమేష్ పందుల కొట్టం కూల్చడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. స్థానిక సర్పంచ్ రాజు, సిబ్బందితో పందుల కొట్టం తొలగించడం సమంజసం కాదన్నారు. పందుల పెంపకంపై ఆధారపడి తమ ఎరుకల కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు రాజు, శ్రీనివాస్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే తొలగించాం..

మండల కేంద్రంలో పందుల గుడిసెలు ఏర్పరుకున్న వారికి మూడు సంవత్సరాల నుంచి నోటీసులు ఇస్తున్నామని, అయినా వాటిని తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్పంచ్ పర్వతగిరి రాజు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను కలిసి గురువారం ఫిర్యాదు చేశారు. పందుల కొట్టంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నిబంధనల ప్రకారమే తొలగించామని వివరించారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. జాతీయ రహదారిని ఆనుకొని పెద్దమ్మతల్లి దేవాలయం, ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ హాస్టళ్ల పక్కనే ప్రభుత్వం దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూమిలో ఏర్పరుకున్న పందుల గుడిసెను తొలగించాలని 3 సంవత్సరాల నుంచి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. అయినా తొలగించకపోవడంతో గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారమే తొలగిస్తుంటే, అడ్డుకొని సిబ్బందిని, సర్పంచ్‌ను ఇష్టారీతిన దూషించిన కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్, పందుల వ్యాపారి దుగ్యాల రమేష్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

ఘనంగా మహనీయుల జయంతి



గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పరకాల: భారత జాతీయోద్యమ నాయకుడు భగత్ సింగ్, తెలుగు కవి గుర్రం జాషువా జయంతితో పాటు నిజాం వ్యతిరేక పోరాట యోధుడు వెల్దురి మాణిక్యరావు వర్ధంతిని గురువారం పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి కౌన్సిలర్ ఏకు రాజుతో పాటు బీఆర్ఎస్ నాయకులు మార్క రఘుపతిగౌడ్, శనిగరపు నవీన్, నల్లెల అనిల్, గోపి పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని పీఏసీఎస్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ గురువారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు ముక్తార్ పాషా వర్ధంతి సభ

రామన్నపేట: ఈనెల 30న నగరంలోని ఖిలా వరంగల్ పెట్రోల్ పంపు రోడ్డులోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ముక్తార్ పాషా 3వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. పోచమ్మమైదాన్ కూడలిలో ముక్తార్ పాషా సంస్మరణ సభ వాల్‌పోస్టర్లను ప్రజా సంఘాల నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు.

బుద్ధభవన్ నిర్మాణ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మడికొండ: హనుమకొండలోని బుద్ధభవన్ పునర్నిర్మాణ ఆహ్వాన పత్రికను మడికొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆవిష్కరించారు. అక్టోబర్ 1వ తేదీన ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మడికొండ గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్, జవ్వాజి కిషన్, జానపట్ల సారయ్య, దుబాసి పద్మరావు, దయాకర్, అనిల్, రాజ్‌కుమార్, కట్ట వెంకటరామ్ నర్సయ్య, అంకేశ్వరపు భానుకుమార్, కిషన్, మహేందర్, వీరేష్, పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మహ్మద్ ప్రవక్త జన్మదినం



ప్రశంస పత్రాలు అందుకుంటున్న రక్తదాతలు

పరకాల: దైవదూత మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పట్టణంలోని ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదు నుంచి పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. అదే విధంగా మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా నేతాజీ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో సివిల్ ఆసుపత్రిలో రక్తదానం శిబిరం నిర్వహించారు. రక్తదానం కార్యక్రమం మోటివేటర్ ఎస్.కె ముస్తాఫా, ఎం.డీ సాదిక్ అలీ, కానిస్టేబుల్ కన్నె రాజు, కొత్తకొండ అరుణ్‌కుమార్‌లను ఆసుపత్రి సూపరింటెంట్ గౌతమ్ చౌహాన్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ అరుణ్‌కుమార్ అభినందించి ప్రశంస పత్రాలు అందించారు.

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు విచారకరం

ఐనవోలు: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పేపర్ 2 ఉత్తీర్ణులైన వారికే స్కూల్ అసిస్టెంట్లుగా నియమించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం విచారకరమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీఎస్ఆర్ మల్లిక్, చుంచుకాల లింగారావులు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 2010 ఆగస్టు 23 వ తేదీ కంటే ముందే సర్వీసులో చేరిన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత మినహాయించబడిందని తెలిపారు. దాని తర్వాత ప్రత్యక్ష నియామకం ద్వారా సర్వీసులో చేరే వారికి మాత్రమే టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అయ్యిందని పేర్కొన్నారు. ఈ ఉద్దేశ్యంతో సర్వీసులో ఉన్న ఏ ఉపాధ్యాయుడు టెట్ పరీక్ష రాయలేదని తెలిపారు. హఠాత్తుగా టెట్ ఉత్తీర్ణులైన వారికే పదోన్నతి కల్పిస్తామని చెప్పడం సరికాదని తెలిపారు. పదోన్నతుల కోసం ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్న సీనియర్ టీచర్లకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టులకు సరిపడా అభ్యర్థులు కూడా లభ్యమయ్యే పరిస్థితి లేదని, రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పుపై పున:సమీక్షకు అప్పీలు చేయాలని కోరారు.

బహుజన రాజ్యంతోనే సామాజిక న్యాయం



అభివాదం చేస్తున్న నాయకులు

హన్మకొండ: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం జరగాలంటే బహుజన రాజ్యం రావాలని, ఆ దిశగా తామంతా ఐక్యంగా పోరాడాలని సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు యేశబోయిన సాంబయ్య యాదవ్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని న్యాయవేదిక జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దామెరుప్పుల శంకర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కొమురం భీం లాంటి అనేక మంది వీరులు పోరాడి దొరల గడీలను కూలదోచారని వివరించారు. ఆనాడు రజాకార్లను ఎదురించింది బహుజనులే, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణ త్యాగాలను చేసింది వారేనని అని చెప్పారు. బహుజనుల కొట్లాడి తెచ్చిన తెలంగాణను ప్రస్తుతం దొరలు ఏలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



చెవిలో పువ్వుతో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

ఎల్కతుర్తి: ఆశ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని మండల పరిషత్ కార్యాలయాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆశలు చెవిలో పువ్వుతో నిరసన తెలిపారు. వీరికి సీఐటీయూ గౌవర అధ్యక్షుడు రాగుల రమేష్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఆశలకు రూ.18వేలు వేతనం నిర్ణయించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశలకు హెల్త్ కార్డులు అందించాలని, రూ. 5లక్షల భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. టీబీ, లెప్రసీ కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల నుంచి నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మెట్ట రవి, ఆశ వర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘నాయిని’వి అసత్య ఆరోపణలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ వేముల శ్రీనివాస్

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌పై కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు ధ్వజమెత్తారు. హనుమకొండలోని అశోక హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, కానుగంటి శేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ భూకబ్జాలకు పాల్పడుతున్నారని నాయిని విమర్శల్లో వాస్తవం లేదన్నారు. తన ఉనికి కోసం, రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీ, ఆపార్టీ నాయకుడు నాయిని రాజేందర్ రెడ్డి అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వినయ్‌భాస్కర్‌పై బురద జల్లే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పులి రజనీకాంత్, నలుబోలు సతీష్, చుంచు అశోక్, నెక్కొండ కిషన్, వీరగంటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమల సమస్యలు పరిష్కరించాలి



సదస్సులో మాట్లాడుతున్న గడ్డం కృష్ణ

దామెర: రాష్ట్రంలోని గొల్ల, కురుమల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా గౌరవ అధ్యక్షులు ప్రొ గడ్డం కృష్ణ కోరారు. మండలంలోని ఊరుగొండ రైతు వేదికలో ఆ సంఘం మండల సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు రెండో విడత గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గొర్రెల పంపిణీకి బదులు నగదు బదిలీ ఇవ్వాలని కోరారు. గొర్రెల పంపిణీ చేయని పక్షంలో రానున్న రోజుల్లో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో 8,109 సొసైటీలు, 7,61,895 మంది సభ్యులకు గాను 7,31,368 మంది లబ్ధిదారులుగా ఎంపికచేసి 3,39,980 మందికి ఇంకా పంపిణీ చేయాల్సి ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,000 మంది అప్పులుచేసి డీడీలు కట్టి ఏళ్ల గడుస్తున్నా గొర్రెల పంపిణీ చేయడం లేదని విమర్శించారు. విద్యావంతులైన యువతకు 70 శాతం సబ్సిడీతో గొర్రెల ఫామ్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో జిల్లా ప్రధాన కార్యదర్శి లింగయ్య, జిల్లా నాయకులు దాడి మల్లయ్య, ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, సహాయ కార్యదర్శి పోటు రాజ్‌కుమార్, సీతారాంపూర్ సర్పంచ్ తుత్తురు శ్రీనివాస్, నాయకులు బత్తిని సమ్మక్కొమురెల్లి, శంకర్, మల్లయ్య, గాదె రాజు, పిండి సాంబయ్య, మేరుగు శివ, కొమురయ్య, గాలి రవి, మేరుగు సంపత్, ఎల్లబోయిన రాజు, బైకని రాజు, రామరాజు, గడల కొమురయ్య, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

అరూరి రమేష్‌కు ఓటమి తప్పదు



మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

హసన్‌పర్తి: వచ్చే ఎన్నికల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు ఓటమి తప్పదని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాటు ఎమ్మెల్యేగా పనిచేసిన రమేష్ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిని విస్మరించడంతోనే పలు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే రమేష్‌ను అడ్డగించి నిరసన తెలిపారని గుర్తుచేశారు. సమావేశంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, మాజీ వార్డు సభ్యుడు తాళ్లపల్లి రమేష్, నాయకులు సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.